


PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు






| మంగళవారం 04 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి:02 సంచిక :63 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|





## మీ సేవ కేంద్రాల బలోపేతానికి కార్యాచరణ వేగవంతం – డిజిటల్ సేవల విస్తరణపై ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు దిశానిర్దేశం

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: రాష్ట్ర ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన డిజిటల్ సేవలు అందించేందుకు మీ సేవ కేంద్రాలను సాంకేతికంగా మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ప్రపంచ బ్యాంక్ డిజిటల్–ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ మహేష్ ఉత్తమ్‌చందానీ నేతృత్వంలోని ప్రతినిధుల బృందంతో జరిగిన సమావేశంలో డిజిటల్ పాలన, కృత్రిమ మేధస్సు, సైబర్ భద్రత, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డేటా సెంటర్ల అభివృద్ధి, యువతకు ఐటీ ఆధారిత ఉపాధి అవకాశాల విస్తరణ వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ సంస్కరణలను ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు అభినందిస్తూ, ఆధునిక సాంకేతికత వినియోగం, ప్రజా సేవల నాణ్యత పెంపు, డేటా నిర్వహణ వ్యవస్థల బలోపేతానికి సాంకేతిక సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. డిజిటల్ రంగంలో పెట్టుబడులకు తెలంగాణ అనుకూల రాష్ట్రంగా నిలుస్తోందని పేర్కొంటూ సుమారు రూ.2,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా సమగ్ర ప్రాజెక్టు నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం టి-ఫైబర్ ప్రాజెక్టు పురోగతిని సమీక్షించిన ప్రధాన కార్యదర్శి గ్రామీణ, పట్టణ ప్రాంతాలన్నింటికీ వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ అందేలా పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత మెరుగుపరచి ప్రాజెక్టు అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో ఐటీ శాఖ అధికారులు, టి-ఫైబర్ సంస్థ ప్రతినిధులు, ప్రపంచ బ్యాంక్ బృంద సభ్యులు తదితరులు పాల్గొని రాష్ట్రంలో డిజిటల్ మౌలిక వసతుల విస్తరణకు అవసరమైన కార్యాచరణపై అభిప్రాయాలు వ్యక్తం చేశారు.




## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఈ నెల 15న హైదరాబాద్‌లోని చారిత్రక గోల్కొండ కోట రాణీ మహల్ లాన్స్‌లో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో వేడుకలకు సంబంధించిన భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వేదిక సిద్ధీకరణ, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, అత్యవసర సేవలు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్ఠాత్మక కార్యక్రమమని పేర్కొన్న ఆయన, ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించి ఎలాంటి లోపాలకు తావులేకుండా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి ముందుగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లోని వీరుల సైనిక్ స్మారక స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించి, అనంతరం గోల్కొండ కోట రాణీ మహల్ లాన్స్‌కు చేరుకుని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించడంతో పాటు రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారని వెల్లడించారు. రోడ్లు–భవనాల శాఖ వేదిక నిర్మాణం, కూర్చునే ఏర్పాట్లు, బ్యారికేడ్లు, రహదారుల అభివృద్ధి వంటి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, పోలీసు శాఖ సమగ్ర భద్రతా చర్యలు, ట్రాఫిక్ నిర్వహణను సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ పరిసరాల పరిశుభ్రత, సుందరీకరణ, పారిశుద్ధ్య పనులను పూర్తి చేయాలని, వైద్య ఆరోగ్య శాఖ తగిన వైద్య బృందాలు, అంబులెన్సులు, ప్రథమ చికిత్స కేంద్రాలను అందుబాటులో ఉంచాలని, అగ్నిమాపక శాఖ అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఫైర్ టెండర్లు, సిబ్బందిని మోహరించాలని సూచించారు. విద్యుత్ శాఖ నిరంతరాయ విద్యుత్ సరఫరాతో పాటు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ఇతర శాఖలు తమకు అప్పగించిన బాధ్యతలను ముందస్తుగా పూర్తి చేసి పరస్పర సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో పలువురు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, హోం శాఖ, పోలీసు, జీహెచ్‌ఎంసీ, అగ్నిమాపక, సమాచార పౌర సంబంధాల శాఖల ఉన్నతాధికారులు పాల్గొని ఏర్పాట్ల పురోగతిపై చర్చించారు.

## నిమ్స్‌లో 1,000 రోబోటిక్ శస్త్రచికిత్సల మైలురాయి



హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నిమ్స్ ఆస్పత్రి మరో కీలక ఘట్టాన్ని చేరుకుని కేవలం రెండున్నర సంవత్సరాల వ్యవధిలోనే 1,000 రోబోటిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసింది. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి ఈ ఘనత వివరాలను తెలియజేయగా, రోబోటిక్ సర్జరీల్లో భాగస్వాములైన వైద్యులు, నర్సింగ్ అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో నిమ్స్ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి పేర్కొంటూ, ఇటీవల 2,000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల మైలురాయిని చేరుకున్న నిమ్స్ ఇప్పుడు 1,000 రోబోటిక్ శస్త్రచికిత్సలు పూర్తి చేయడం ప్రభుత్వ వైద్యరంగ సామర్థ్యానికి నిదర్శనమన్నారు. దక్షిణ భారతదేశంలో ప్రభుత్వ రంగంలో తొలి రోబోటిక్ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించిన సంస్థగా నిమ్స్ ఇప్పటికే గుర్తింపు పొందిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిమ్స్‌తో పాటు ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో కూడా రోబోటిక్ శస్త్రచికిత్సలను విస్తరించిందని, నిర్మాణంలో ఉన్న కొత్త టిమ్స్ ఆస్పత్రులు, గాంధీ ఆస్పత్రి, కొత్త ఉస్మానియా ఆస్పత్రిలో కూడా అత్యాధునిక రోబోటిక్ ఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేసి ప్రపంచ స్థాయి వైద్య సేవలను ప్రభుత్వ రంగంలోనే అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ ఇప్పటివరకు నిర్వహించిన 1,000 రోబోటిక్ శస్త్రచికిత్సల్లో యూరాలజీ విభాగంలో 590, సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో 248, సర్జికల్ ఆంకాలజీ విభాగంలో 162 శస్త్రచికిత్సలు జరిగాయని వెల్లడించారు. వీటిలో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి ప్రభుత్వ పథకాల ద్వారా పూర్తిగా ఉచితంగా నిర్వహించడం వల్ల ఖరీదైన రోబోటిక్ చికిత్సలు కూడా సామాన్య ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ విజయానికి వైద్యులు, అనస్థీషియా నిపుణులు, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందం, ఇతర సహాయక విభాగాల సమిష్టి కృషే కారణమని పేర్కొంటూ, రాష్ట్రంలో ఆధునిక వైద్య సేవల అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహలకు కృతజ్ఞతలు తెలిపారు.



## సాగునీటి ప్రాజెక్టుల అనుమతులకు వేగం పెంచాలని ఉత్తమ్ ఆదేశం

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: రాష్ట్రంలోని పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్, దిండి, గౌరవెల్లి సాగునీటి ప్రాజెక్టులకు పెండింగ్‌లో ఉన్న పర్యావరణ అనుమతులను ఆరు నెలల్లోగా సాధించే లక్ష్యంతో వేగవంతమైన కార్యాచరణ చేపట్టాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సుప్రీంకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు పర్యావరణ అనుమతుల ప్రక్రియకు స్పష్టమైన మార్గదర్శకాలను అందించిందని పేర్కొంటూ, ఈ అవకాశాన్ని వినియోగించుకుని కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత సంస్థల వద్ద పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు. గతంలో అనుమతులు పొందిన ప్రాజెక్టుల హక్కులు కొనసాగుతాయని, పెండింగ్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం ముందుకు తీసుకెళ్లాలని, తిరస్కరణకు గురైన ప్రతిపాదనలను సాంకేతిక లోపాలు సరిచేసి అవసరమైతే మళ్లీ సమర్పించాలని మంత్రి సూచించారు. ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ఏడు రోజుల్లో రికార్డుల సమీకరణ, 30 రోజుల్లో పర్యావరణ అధ్యయనాలు, 60 రోజుల్లో పరిపాలనా ప్రక్రియలను పూర్తి చేయాలని ఆదేశించారు. గౌరవెల్లి ప్రాజెక్టు పంప్ హౌస్‌ను తక్షణమే వినియోగానికి సిద్ధం చేయడంతో పాటు కాలువల పరిశీలన, మరమ్మతులు చేపట్టాలని, సీతారామ సాగర్ పనులు అనుమతులు వచ్చిన వెంటనే ప్రారంభించేలా అన్ని సన్నాహాలు పూర్తి చేయాలని చెప్పారు. పాలమూరు–రంగారెడ్డి, దిండి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతుల కోసం ప్రత్యేక దృష్టి సారించాలని, జాతీయ హరిత ట్రిబ్యునల్, సుప్రీంకోర్టులో పెండింగ్ కేసులపై న్యాయ బృందంతో సమన్వయం పెంచాలని సూచించారు. పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావంపై కూడా సమీక్ష నిర్వహించిన మంత్రి, తెలంగాణలో ముంపుకు గురయ్యే భూములు, గ్రామాలు, ప్రభుత్వ ఆస్తులపై శాస్త్రీయ అధ్యయనం వేగవంతం చేసి కేంద్ర ప్రభుత్వంతో పాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఎదుట రాష్ట్ర హక్కులను బలంగా వినిపించేలా సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

## ఓటరు జాబితా లోపాలు వెంటనే సరిదిద్దాలి: సీఈవో సుదర్శన్ రెడ్డి




హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని అత్యంత ఖచ్చితత్వంతో పూర్తి చేసి దోషరహిత ఓటరు జాబితాను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డితో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ నాణ్యత, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, గైర్హాజరైన, నివాసం మార్చుకున్న, మరణించిన, నకిలీ ఓటర్ల (ఏఎస్‌డీడీ) జాబితాల పరిశీలన, నో మ్యాపింగ్ కేసులు తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఫొటోలు లేకపోవడం, జన్మతేదీ, లింగ వివరాలు, సంతకాలలో ఉన్న లోపాలను సరిచేసి సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ఏ ఒక్కరి పేరు తొలగించబడకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే రోల్‌బ్యాక్ సదుపాయాన్ని వినియోగించి రికార్డులను పునఃపరిశీలించాలని ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు, సూపర్వైజర్లు, సహాయ ఎన్నికల నమోదు అధికారుల క్షేత్రస్థాయి ధృవీకరణను మరింత బలోపేతం చేయాలని, నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బూత్ లెవల్ అధికారులతో నిర్వహించిన సమావేశాల మినిట్స్‌ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల సంతకాలతో వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని, 85 సంవత్సరాలు దాటిన ఓటర్ల వివరాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన సభ్యులు వేర్వేరు పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తకుండా హేతుబద్ధీకరణ ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పూర్తి చేయాలని చెప్పారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో పాటు అన్ని జిల్లాల ఎన్నికల అధికారుల పురోగతిని సమీక్షించిన ఆయన, నో మ్యాపింగ్ కేసులు, ఏఎస్‌డీడీ అంశాలు, సేకరించని ఎన్యూమరేషన్ ఫారాలు, ఇతర పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి పారదర్శకమైన, దోషరహిత ఓటరు జాబితా రూపొందించాలని ఆదేశించారు.

# ప్రభుత్వ పథకాల అమలుకు శాఖల సమన్వయం కీలకం: సీఎస్ సంజయ్ జాజు

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో అన్ని శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. సచివాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రభుత్వ పథకాల పురోగతి, లక్ష్యాలు, అమలు స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు సమగ్ర డ్యాష్‌బోర్డ్‌తో పాటు ప్రత్యేక స్పీడ్ సెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో ముఖ్యమంత్రి శాఖల పనితీరు, ఆర్థిక పరిస్థితి, కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు, లక్ష్యాల సాధనపై సమీక్ష నిర్వహించనున్నందున అన్ని శాఖలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి శాఖ వినూత్న కార్యక్రమాలు, విజయగాథలను సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీలకు టీ-ఫైబర్ కనెక్టివిటీ విస్తరించాలని, విజన్–2047 లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణ చేపట్టాలని పేర్కొన్నారు. కేంద్ర నిధుల విడుదలలో జాప్యం లేకుండా వినియోగ ధ్రువీకరణ పత్రాలు, నివేదికలు, ప్రాజెక్టు ప్రతిపాదనలు సకాలంలో పంపించాలని సూచించారు. నవంబర్ 14 నుంచి ప్రారంభమయ్యే ఖేలో ఇండియా క్రీడల విజయవంతమైన నిర్వహణ కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని, 11 వేదికల్లో 26 క్రీడాంశాల్లో 7 వేల మందికిపైగా క్రీడాకారులు పాల్గొనే ఈ ప్రతిష్ఠాత్మక పోటీలకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని ఆదేశించారు. కోర్ అర్బన్ ప్రాంతంలో వాహన కాలుష్య నియంత్రణకు డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ విధానంలోకి మార్చే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, ఎల్‌నినో ప్రభావంతో వరి సాగుకు నీటి లభ్యత తగ్గే అవకాశాల నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని సంబంధిత శాఖలను ఆదేశించారు.

# మణుగూరు బొగ్గు బ్లాక్ సింగరేణికి దక్కడం చారిత్రక విజయం: భట్టి విక్రమార్క

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో మణుగూరు పీకేఓసీ–2 డిప్ సైడ్ బొగ్గు బ్లాక్ సింగరేణి సంస్థకు దక్కడం తెలంగాణకు చారిత్రక విజయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వ కృషి వల్ల నెల రోజుల వ్యవధిలో సింగరేణికి రెండో కీలక విజయం లభించిందని ఆయన తెలిపారు. ఈ బ్లాక్ ద్వారా ఏటా 60 లక్షల టన్నుల చొప్పున 20 సంవత్సరాల పాటు మొత్తం 120 మిలియన్ టన్నుల జీ–8 నాణ్యమైన బొగ్గును వెలికితీసే అవకాశం ఉండటంతో రాష్ట్ర విద్యుత్ భద్రత మరింత బలోపేతం అవుతుందని చెప్పారు. దాదాపు రెండు వేల మందికి ఉపాధి భద్రత కల్పించడంతో పాటు మణుగూరు ప్రాంత ఆర్థికాభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్నారు. గతంలో నైనీ బొగ్గు గనిని ప్రారంభించడంతో పాటు తాడిచర్ల–2 బ్లాక్‌కు మైనింగ్ లీజు సాధించామని, ఇప్పుడు మణుగూరు బ్లాక్‌ను సింగరేణికి దక్కేలా చేయడం ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమన్నారు. రానున్న రోజుల్లో కోయగూడెం–3, సత్తుపల్లి–3 బొగ్గు బ్లాక్‌లను కూడా సింగరేణికి సాధించేందుకు కృషి చేస్తామని, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా బొగ్గు గనులు, కీలక ఖనిజాల అన్వేషణలో సింగరేణి విస్తరణకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి యాజమాన్యం, కార్మికులు, కార్మిక సంఘాల ప్రతినిధులకు ఈ సందర్భంగా మంత్రి అభినందనలు తెలిపారు.




# ఉర్దూ పాత్రికేయుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి అజహరుద్దీన్

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: పాత్రికేయుల సంక్షేమంతో పాటు ఉర్దూ భాష పరిరక్షణ, అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని రాష్ట్ర మైనారిటీల సంక్షేమ, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్ తెలిపారు. నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీలో తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ 10వ వ్యవస్థాపక దినోత్సవం, వార్షిక అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న ఆయన పాత్రికేయ వృత్తి సమాజానికి మార్గదర్శకమని, ప్రజాస్వామ్య పరిరక్షణలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఉర్దూ పాత్రికేయులు భాషాభివృద్ధితో పాటు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో విశేష కృషి చేస్తున్నారని అభినందించారు. నిర్మాణాత్మక విమర్శలు ప్రభుత్వానికి లోపాలను సరిదిద్దుకునే అవకాశాన్ని కల్పిస్తాయని, పాత్రికేయులు నైతిక విలువలు, వాస్తవాలను ఆధారంగా చేసుకుని ప్రజాహితాన్ని దృష్టిలో ఉంచుకుని విధులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం, మీడియా, సమాజం కలిసి పనిచేస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంటూ ఉర్దూ పాత్రికేయుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉర్దూ జర్నలిజంలో విశిష్ట సేవలు అందించిన పలువురు పాత్రికేయులకు ప్రశంసాపత్రాలు, శాలువాలు, జ్ఞాపికలతో పాటు నగదు పురస్కారాలను మంత్రి అందజేసి సత్కరించారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా, డివిజన్ స్థాయిలో స్వీకరించే ప్రతి ప్రజావాణి దరఖాస్తును తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, పాత పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న అర్జీలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు నమోదు చేసి రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రెవెన్యూ డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి సమావేశాలకు అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని, స్థానిక సమస్యలను స్థానికంగానే పరిష్కరించడం ద్వారా ప్రజలకు త్వరితగతిన న్యాయం అందుతుందని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 117 దరఖాస్తులు అందగా, వాటిలో భూ సమస్యలకు సంబంధించినవి 59, మహిళా శిశు సంక్షేమ శాఖకు 10, పంచాయతీరాజ్ శాఖకు 7, జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు 6, మిగిలిన 35 దరఖాస్తులు ఇతర శాఖలకు సంబంధించినవిగా గుర్తించి పరిష్కారం కోసం సంబంధిత శాఖలకు పంపించినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్‌వో ప్రేమ్‌రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్యతో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.




# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని గడువులోగా పూర్తి చేయాలి: సి. సుదర్శన్ రెడ్డి

సూర్యాపేట | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ పురోగతి, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్, ఎన్యూమరేషన్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించగా, సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని, ఓటరు జాబితాలో డూప్లికేట్ నమోదులు, అసంగతతలు, మ్యాపింగ్ సమస్యలు, సంబంధిత పెండింగ్ అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సరిదిద్దాలని సూచించారు. ఒకే కుటుంబ సభ్యులందరికీ సాధ్యమైనంత వరకు ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఫోటో వివరాల్లో ఉన్న వ్యత్యాసాలను బూత్ లెవల్ అధికారులు పరిశీలించి సవరించాలని ఆదేశించారు. 18 సంవత్సరాలు పూర్తి చేసిన ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, బీఎల్‌వోలు, బీఎల్ఏలు సమన్వయంతో ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిబంధనల మేరకు పరిశీలించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వాటి ఫోటోలు, సంతకాలు, ఇతర వివరాలను నమోదు చేయాలని, ప్రత్యేక సవరణ కార్యక్రమ షెడ్యూల్‌ను కచ్చితంగా అమలు చేసి అన్ని ప్రక్రియలను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్‌వో ప్రేమ్‌రాజ్, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ ఆర్‌డీవోలు, ఎన్నికల శాఖ అధికారులు పాల్గొన్నారు.



# ఆగస్టు 10లోగా ఓటర్ల జాబితా పరిశీలన పూర్తి చేయాలి

సూర్యాపేట | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పరిశీలన (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీలోగా పూర్తి చేసి ఎన్యూమరేషన్ ఫారాల సేకరణను వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వేను వేగవంతం చేసి ప్రతి ఓటరు వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఓటర్ల జాబితాలో గైర్హాజరు, నివాసం మార్చుకున్న, మరణించిన వారి జాబితాలోని ప్రతి పేరును క్షేత్రస్థాయిలో వ్యక్తిగతంగా ధృవీకరించాలని, ఆన్‌లైన్ డిజిటలైజేషన్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. డిజిటలైజేషన్‌లో తప్పులు జరిగితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్లు, ఆర్‌డీవోలు వెంటనే రాజకీయ పార్టీల ప్రతినిధులతో సర్వపక్ష సమావేశాలు నిర్వహించాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కనీసం 25 నుంచి 30 ఎన్యూమరేషన్ ఫారాలను స్వయంగా యాదృచ్ఛికంగా పరిశీలించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్‌వో ప్రేమ్‌రాజ్, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ ఆర్‌డీవోలు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి శిశువుకు తొలి ఆహారం తల్లిపాలే: కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: ప్రతి శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలే అత్యుత్తమ తొలి ఆహారమని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాల ప్రాధాన్యతను ప్రతి కుటుంబం గుర్తించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, శిశువు పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం ద్వారా అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. పుట్టిన వెంటనే వచ్చే ముర్రుపాలను తప్పనిసరిగా శిశువుకు అందించాలని, అవి సహజ రోగనిరోధక శక్తిని పెంచి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు బలమైన పునాది వేస్తాయని తెలిపారు. తల్లిపాలు శిశువు శారీరక, మానసిక వికాసానికి ఎంతో దోహదపడటంతో పాటు తల్లి–శిశువు మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితా దేవి, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, ఆర్‌డీవో రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.




# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

సంగారెడ్డి | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జాతీయ స్ఫూర్తికి ప్రతీకగా ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆగస్టు 15న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకలకు వేదిక, అతిథుల సీటింగ్, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తుగా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించే సమగ్ర జిల్లా ప్రగతి నివేదికను సిద్ధం చేయాలని జిల్లా ప్రణాళికాధికారిని ఆదేశించారు. ప్రోటోకాల్ నిబంధనల మేరకు ప్రజాప్రతినిధులు, విశిష్ట అతిథులకు ఆహ్వానాలు పంపాలని, విద్యార్థులతో దేశభక్తిని పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు విద్యాశాఖతో పాటు సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రశంసాపత్రాల ప్రదానానికి శాఖల వారీగా ఉత్తమ ఉద్యోగుల వివరాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచిస్తూ, ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

సంగారెడ్డి | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: ప్రజావాణిలో ప్రజలు సమర్పించే ప్రతి ఫిర్యాదు, వినతిని క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి నిర్దిష్ట రిమార్కులతో నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యంగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా సోమవారం మొత్తం 67 వినతులు అందగా, వాటిలో కలెక్టరేట్‌లో 48, సంగారెడ్డి డివిజన్‌లో 8, జహీరాబాద్ డివిజన్‌లో 7, నారాయణఖేడ్ డివిజన్‌లో 4 వినతులు నమోదయ్యాయని, అందోల్ డివిజన్‌లో ఎలాంటి ఫిర్యాదులు నమోదు కాలేదని తెలిపారు. రెవెన్యూ, గృహనిర్మాణం, పెన్షన్లు, పంచాయతీరాజ్, నీటిపారుదల, కాలుష్య నియంత్రణ మండలి, కార్మిక, విద్య, ఆర్టీసీ, ఉపాధి కల్పన, మహిళా–శిశు సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖలకు సంబంధించిన సమస్యలపై ఎక్కువగా వినతులు అందినట్లు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించి పారదర్శకమైన పరిపాలన అందించడం అధికారుల బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంగారెడ్డి ఆర్డీవో, కలెక్టరేట్ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ విజయవంతానికి రాజకీయ పార్టీల సహకారం అవసరం: కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: జిల్లాలో జరుగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, విజయవంతంగా పూర్తి చేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు క్రియాశీలకంగా సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. ఎన్నికల ప్రక్రియను మరింత పటిష్ఠంగా నిర్వహించడంలో రాజకీయ పార్టీల సూచనలు, సహకారం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ పురోగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియ, ఓటరు జాబితా సవరణ అంశాలపై ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. భారత ఎన్నికల సంఘం ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ గడువును ఆగస్టు 10 వరకు పొడిగించిందని, ఇప్పటివరకు ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు వెంటనే తమ బూత్ స్థాయి అధికారి లేదా సంబంధిత సహాయ కేంద్రాల్లో ఫారాలు అందజేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ సగటున 78.50 శాతం పూర్తయిందని, నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ చేపట్టనున్నట్లు, ఓటరు జాబితాలో గుర్తించిన వ్యత్యాసాలకు సంబంధించి సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గాల వారీగా డిజిటలైజేషన్ పురోగతిని పరిశీలిస్తే నారాయణఖేడ్‌లో 88 శాతం, ఆందోల్‌లో 87 శాతం, జహీరాబాద్‌లో 81 శాతం, సంగారెడ్డిలో 79 శాతం, పటాన్‌చెరులో 66 శాతం పూర్తయినట్లు తెలిపారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎస్ఐఆర్ ప్రక్రియపై సంతృప్తి వ్యక్తం చేసి, కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు అందించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, ఈఆర్‌వోలు, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఓటర్ల డిజిటలైజేషన్‌లో నాణ్యత, పర్యవేక్షణకు ప్రాధాన్యం: కలెక్టర్ ప్రతీక్ జైన్






సంగారెడ్డి | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: సంగారెడ్డి జిల్లాలో జరుగుతున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, నాణ్యతతో, సమయపాలనతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల వివరాల డిజిటలైజేషన్‌లో పొరపాట్లకు తావివ్వకుండా కఠిన పర్యవేక్షణ అవసరమని స్పష్టం చేశారు. ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ గడువు ఆగస్టు 10 వరకు పొడిగించబడిందని, అర్హులైన ఓటర్లు వెంటనే ఫారాలు సమర్పించాలని సూచించారు. జిల్లాలో డిజిటలైజేషన్ సగటున 78.50 శాతం పూర్తయిందని, నారాయణఖేడ్ 88%, ఆందోల్ 87%, జహీరాబాద్ 81%, సంగారెడ్డి 79%, పటాన్‌చెరు 66% పురోగతి సాధించాయని తెలిపారు. అలాగే పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణను పకడ్బందీగా చేపట్టి ఒకే కుటుంబ ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచనలు అందించగా, అధికారులు, ఈఆర్‌వోలు పాల్గొన్నారు.

# డిగ్రీ ప్రవేశాలకు DOST స్పెషల్ డ్రైవ్ అవకాశం

సంగారెడ్డి | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), సంగారెడ్డిలో డిగ్రీ ప్రవేశాలకు విద్యార్థులకు మరో అవకాశం కల్పిస్తూ DOST 2026–27 స్పెషల్ డ్రైవ్ ఫేజ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. ప్రవీణ్ తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి, కళాశాల విద్య కమిషనర్, డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (DOST) విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఇప్పటివరకు డిగ్రీ సీటు పొందని విద్యార్థులు, అలాగే DOSTలో నమోదు చేసుకోని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆగస్టు 6 నుంచి 11 వరకు రిజిస్ట్రేషన్, ఆగస్టు 6 నుంచి 12 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు, ఆగస్టు 14న సీట్ల కేటాయింపు, ఆగస్టు 14 నుంచి 18 వరకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్, ఆగస్టు 17 నుంచి 18 వరకు కళాశాలలో రిపోర్టింగ్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఆధునిక ప్రయోగశాలలు, డిజిటల్ తరగతి గదులు, విశాలమైన గ్రంథాలయం, ప్లేస్‌మెంట్ సౌకర్యాలు, కెరీర్ గైడెన్స్, నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు DOST స్పెషల్ డ్రైవ్‌లో తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఏ), సంగారెడ్డిని మొదటి ప్రాధాన్యతగా ఎంపిక చేసుకుని ఎక్కువ వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.



# బంకీపూర్ ఉపఎన్నికలో ప్రశాంత్ కిశోర్ విజయం

పాట్నా | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: బిహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ ఉపఎన్నికలో జనసురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ఘన విజయం సాధించారు. భారతీయ జనతా పార్టీ అభ్యర్థి నీరజ్ కుమార్‌పై 20 వేలకుపైగా ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ ఉపఎన్నికలో అధికార, ప్రతిపక్ష పార్టీల సంప్రదాయ ఓటు బ్యాంకుల్లో చీలిక ఏర్పడడం ప్రశాంత్ కిశోర్‌కు అనుకూలంగా మారినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అగ్రవర్ణ ఓటర్లతో పాటు ముస్లిం–యాదవ్ వర్గాల ఓటర్లలో కొంతమంది కూడా ఆయనకు మద్దతు తెలిపినట్లు సమాచారం. ఎన్నికల ప్రచారంలో కులం, మతం వంటి అంశాల కంటే ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై దృష్టి సారించడం ఓటర్లను ఆకర్షించినట్లు తెలుస్తోంది. వ్యూహకర్తగా పేరొందిన ప్రశాంత్ కిశోర్ ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతూ సాగించిన ప్రచారం విజయానికి దోహదపడినట్లు విశ్లేషణలు చెబుతున్నాయి. ఇదే సమయంలో గుజరాత్‌లోని మంజల్పూర్ అసెంబ్లీ ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థి సతీశ్ పటేల్ సుమారు 30 వేలకుపైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించగా, మధ్యప్రదేశ్‌లోని దతియా అసెంబ్లీ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఘనశ్యామ్ సింగ్ బీజేపీ అభ్యర్థి అశుతోష్ తివారీపై 6,016 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.

# భారత విద్యార్థుల ఉద్యమానికి గ్రెటా థన్‌బర్గ్ సంఘీభావం



లండన్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: భారతదేశంలో పోటీ పరీక్షల నిర్వహణ, నీట్ పరీక్ష అక్రమాలపై విద్యార్థులు చేపట్టిన ఉద్యమానికి అంతర్జాతీయ స్థాయిలో మద్దతు లభిస్తున్నట్లు వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో, లండన్‌లోని భారత హైకమిషన్ ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రముఖ వాతావరణ ఉద్యమకారిణి గ్రెటా థన్‌బర్గ్ పాల్గొన్నట్లు సమాచారం. ఎస్ఎఫ్ఐ–యూకే ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో భారత విద్యార్థులు న్యాయమైన, పారదర్శకమైన పరీక్షా వ్యవస్థ కోసం చేస్తున్న పోరాటానికి తన సంఘీభావం ప్రకటించినట్లు పేర్కొన్నారు. భారత విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలు, పోటీ పరీక్షల్లో అక్రమాలు, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై ఏర్పడిన అనిశ్చితి తన దృష్టిని ఆకర్షించాయని ఆమె అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఢిల్లీలోని జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ ముట్టడి వరకు కొనసాగిన విద్యార్థుల ఉద్యమం, ఆందోళనల సందర్భంగా జరిగిన పోలీసు చర్యలు, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్చుక్ చేపట్టిన నిరాహార దీక్ష అంతర్జాతీయంగా చర్చకు దారితీశాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ కొనసాగిన ఈ ఉద్యమానికి గ్రెటా థన్‌బర్గ్ మద్దతు తెలపడం ద్వారా భారత విద్యార్థుల డిమాండ్లు అంతర్జాతీయ వేదికపై ప్రాధాన్యం పొందినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ అంశానికి సంబంధించిన అధికారిక వివరాలు, నిరసనల నేపథ్యంలో వెలువడిన సమాచారం స్వతంత్రంగా ధృవీకరణకు లోబడి ఉందని గమనించాలి.



## కేబుల్ ఛానళ్ల అక్రెడిటేషన్లపై త్వరగా నిర్ణయం తీసుకోవాలి

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: రాష్ట్రవ్యాప్తంగా కేబుల్ టీవీ న్యూస్ ఛానళ్లలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులను వెంటనే జారీ చేసి, పెండింగ్‌లో ఉన్న సమస్యను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఫెడరేషన్ నాయకులతో కలిసి రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డిని సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. అక్రెడిటేషన్ ప్రక్రియ ప్రారంభమై నాలుగైదు నెలలు గడిచినా కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు ఇప్పటికీ కార్డులు జారీ కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాల్లో డీపీఆర్వోలు కేబుల్ ఛానల్ జర్నలిస్టులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ, జిల్లా కేంద్రంలో స్టూడియో ఉండాలనే నిబంధనను సడలిస్తూ సర్క్యులర్ జారీ చేయాలని, అలాగే ఎంఐబీ రిజిస్ట్రేషన్‌తో ఐపీ బాక్స్‌ల ద్వారా ప్రసారమవుతున్న అన్ని ఛానళ్లకు కూడా అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని త్వరలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ నేషనల్ కౌన్సిల్ సభ్యుడు కుంచం శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో-కన్వీనర్ ఆర్. శ్రీనివాస్ గౌడ్, మహ్మద్ షఫీవుద్దీన్, జీవన్ కుమార్ గౌడ్, ఫారూఖ్ పటేల్, జూలూరు సత్యం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





## అందోల్‌లో ఈశ్వరాలయంలో ప్రత్యేక జలాభిషేకం

అందోల్ | సందేశం టైమ్స్ అందోల్ మండల ప్రతినిధి వి. వెంకటేశం | ఆగస్టు 4: అందోల్ మండల కేంద్రంలోని శ్రీ ఈశ్వరాలయంలో గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక జలాభిషేక కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుమారు 200 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ ఆచారాన్ని ప్రతి ఏడాది గ్రామ ప్రజలు భక్తి భావంతో నిర్వహించడం విశేషం. పవిత్ర జలాలను ఆలయానికి తీసుకువచ్చిన భక్తులు శివలింగానికి జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని పరమేశ్వరుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణంలో పూజలు నిర్వహించారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయాన్ని భావితరాలకు కూడా కొనసాగించాలని గ్రామ పెద్దలు పిలుపునిచ్చారు.

## రాఘవపురం ఎక్స్‌రోడ్ గ్రామ కాంగ్రెస్ కమిటీకి నూతన అధ్యక్షుడి ఎంపిక



మోతె | సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి | ఆగస్టు 4: మోతె మండలంలోని రాఘవపురం ఎక్స్‌రోడ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని గ్రామ సర్పంచ్ కోల లింగయ్య గౌడ్, ఉపసర్పంచ్ తాటికొండ సుజిత్ రెడ్డి సమక్షంలో పార్టీ కార్యకర్తల ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా కారింగుల లింగమూర్తి గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా బత్తిపెల్లి నాగమల్లయ్య గౌడ్, ఉపాధ్యక్షుడిగా బత్తిని రవి గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కోల కృష్ణ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బత్తిపెల్లి సతీష్ గౌడ్, కోశాధికారిగా బొడ్డు గురవయ్య గౌడ్, ప్రచార కార్యదర్శిగా తాటికొండ సోమిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా రాచకొండ సోమయ్య గౌడ్, అర్వపల్లి లింగయ్య, పజ్జూరి చిన్న వెంకన్న, శేషగాని వెంకన్న గౌడ్, సోషల్ మీడియా బాధ్యతలకు బత్తిపెల్లి సైదులు గౌడ్ ఎన్నికయ్యారు. అనంతరం మోతె మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి నూతన కమిటీ సభ్యులను పార్టీ కండువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మండవ శ్రీనివాస్ గౌడ్, బొడ్డు వెంకట్ గౌడ్, యువ నాయకులు కోల అక్షయ్ గౌడ్‌తో పాటు గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అనంతగిరి నూతన ఎస్ఐ ఏడుకొండలకు ఘన సన్మానం

అనంతగిరి | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 4: అనంతగిరి మండల పోలీస్ స్టేషన్ నూతన సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఏడుకొండలను వాయిలసింగవరం గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ ఏడుకొండలు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తానని, ప్రజలు చిన్న చిన్న సమస్యలకైనా నిర్భయంగా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా విధులు నిర్వహిస్తానని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బుర్రా వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు కొల్లు సుబ్బారావు, చుండూరు మురళి, గుండ్లపల్లి వెంకన్న, బుర్రా పెద్ద వెంకన్న, బుర్రా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



## నిరుద్యోగ యువకుడు వేణుకుమార్ కుటుంబానికి మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు రూ.50 వేల ఆర్థిక సాయం

సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జి శెట్టి సురేష్ / ఆగస్టు 4 గ్రూప్స్ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన యువకుడు జీ. వేణుకుమార్ కుటుంబానికి బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు చేయూత అందించారు. నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. వేణుకుమార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి వెళ్లి పరామర్శించిన నామ, కుటుంబ పరిస్థితిని తెలుసుకుని అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మరుసటి రోజే ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించారు. ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కమల్‌రాజు, ట్రస్ట్ ప్రతినిధి కనక మేడల సత్యనారాయణ చేతుల మీదుగా వేణుకుమార్ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఎలాంటి పరిస్థితుల్లోనూ యువత ఆత్మహత్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని, ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. క్లిష్ట సమయంలో తమ కుటుంబానికి ఆర్థిక, మానసిక అండగా నిలిచిన నామ నాగేశ్వరరావుకు వేణుకుమార్ కుటుంబ సభ్యులు, నిరుద్యోగ యువత కృతజ్ఞతలు తెలిపారు.



## గుడిమల్కాపురం గ్రామపంచాయతీ భవనం ప్రారంభించాలని ధర్నా

చింతలపాలెం | సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి | ఆగస్టు 4: చింతలపాలెం మండలంలోని గుడిమల్కాపురం గ్రామపంచాయతీ నూతన భవనాన్ని కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రారంభించకపోవడాన్ని నిరసిస్తూ గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. అధికారులు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఉద్దేశపూర్వకంగా గ్రామపంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించకుండా జాప్యం చేస్తున్నారని వారు ఆరోపించారు. అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించి, నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. గ్రామాభివృద్ధికి అవసరమైన పరిపాలనా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని నిరసనకారులు కోరారు.




## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి / ఆగస్టు 4: మెదక్ జిల్లాలో ఆగస్టు 15న నిర్వహించనున్న జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించేలా ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకలకు సంబంధించిన వేదిక, అతిథుల సీటింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా సమగ్ర జిల్లా ప్రగతి నివేదికను సిద్ధం చేయాలని జిల్లా ప్రణాళికాధికారిని ఆదేశించిన కలెక్టర్, ప్రోటోకాల్ నిబంధనలను పాటిస్తూ ప్రజాప్రతినిధులు, విశిష్ట అతిథులకు ఆహ్వానాలు పంపాలని తెలిపారు. విద్యార్థులతో దేశభక్తిని చాటే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని, శాఖల వారీగా ఉత్తమ ఉద్యోగుల ఎంపికకు ప్రతిపాదనలు నిర్ణీత గడువులోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో అంబాదాస్ రాజేశ్వర్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్యతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.




## జీవవైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత.. విదేశీ దురాక్రమణ కలుపు మొక్కల నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేయాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి / ఆగస్టు 4: మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో ఈకో ఫాన్ సొసైటీ ఆధ్వర్యంలో విదేశీ దురాక్రమణ కలుపు మొక్కల గుర్తింపు, అవగాహన, నిర్మూలన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో పెరిగిన విదేశీ కలుపు మొక్కలను అధికారులు, సిబ్బందితో కలిసి తొలగించిన కలెక్టర్, జీవవైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా విదేశీ దురాక్రమణ కలుపు మొక్కల వ్యాప్తికి వ్యతిరేకంగా ఈకో ఫాన్ సొసైటీ రూపొందించిన "థంబ్స్ డౌన్" సంకేతాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఈకో ఫాన్ సొసైటీ ముఖ్య కార్యనిర్వాహక అధికారి మెట్టు సాయి సంపత్ మాట్లాడుతూ విదేశీ దురాక్రమణ కలుపు మొక్కలు వ్యవసాయ దిగుబడులను తగ్గించడంతో పాటు జలవనరులు, అడవులు, స్థానిక వృక్షజాతులు, జీవవైవిధ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వివరించారు. రాష్ట్ర సమన్వయకర్త తలారి విక్రమ్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో ఈ మొక్కలను ప్రారంభ దశలోనే గుర్తించి తొలగిస్తే వాటి విస్తరణను సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. ఈకో ఫాన్ సొసైటీ చేపడుతున్న కార్యక్రమాన్ని అభినందించిన కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను విదేశీ దురాక్రమణ కలుపు మొక్కల రహితంగా ఉంచేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమం ముగింపులో జీవవైవిధ్య పరిరక్షణ సందేశాన్ని సమాజంలోని ప్రతి వర్గానికి చేర్చేందుకు నిరంతరం కృషి చేస్తామని పాల్గొన్నవారు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, కలెక్టరేట్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## బలమైన భవిష్యత్తుకు తల్లిపాలే పునాది: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి – మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి / ఆగస్టు 4: ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆమె మాట్లాడుతూ, ప్రతి తల్లి తన బిడ్డకు జన్మించిన గంటలోపే తల్లిపాలు అందించాలని, తల్లిపాలు శిశువుకు సురక్షితమైనవి, స్వచ్ఛమైనవి, సంపూర్ణ పోషకాహారాన్ని అందించే తొలి ఆహారమని తెలిపారు. శిశువు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు, బలమైన భవిష్యత్తుకు తల్లిపాలే పునాదిగా నిలుస్తాయని, కనీసం ఆరు నెలల పాటు పూర్తిగా తల్లిపాలే ఇవ్వాలని, అనంతరం ఒక సంవత్సరం లేదా అంతకంటే ఎక్కువ కాలం కొనసాగించాలని సూచించారు. తల్లులు పోషకాహారం తీసుకోవడం ద్వారా పిల్లలకు నాణ్యమైన పాలు అందుతాయని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో తల్లిపాల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తల్లుల్లో అవగాహన పెంచి ప్రతి శిశువుకు తల్లిపాలు అందేలా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి హేమ భార్గవి, డీసీహెచ్‌ఎస్ శివదయాల్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, డీఆర్వో అంబాదాస్ రాజేశ్వర్, ఏఎంఓ రాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గణేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్

సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి / ఆగస్టు 4: ప్రజావాణిలో ప్రజలు సమర్పించే ఫిర్యాదులు, వినతులను సంబంధిత అధికారులు సత్వరమే పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. సోమవారం మెదక్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 57 దరఖాస్తులు అందగా, వాటిలో భూభారతి సంబంధిత 14, పెన్షన్లకు సంబంధించిన 7, హౌసింగ్‌కు సంబంధించిన 6, ఇతర శాఖలకు సంబంధించిన 30 దరఖాస్తులు ఉన్నాయని తెలిపారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హుల సమస్యలకు వేగంగా పరిష్కారం చూపాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు.

## సమయపాలన పాటించని వ్యవసాయ శాఖ అధికారులపై రైతుల ఆగ్రహం.. కార్యాలయం ముందు బైఠాయించి నిరసన



సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి / ఆగస్టు 4: మెదక్ జిల్లా వెల్దుర్తి మండల వ్యవసాయ శాఖ అధికారులు సమయపాలన పాటించకపోవడంతో రైతులు కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. సోమవారం వ్యవసాయ సాగు సీజన్ నేపథ్యంలో యూరియా బుకింగ్‌తో పాటు ఇతర వ్యవసాయ పనుల కోసం ఉదయం 10 గంటలకే కార్యాలయానికి చేరుకున్న రైతులు, ఉదయం 11 గంటలు దాటినా కార్యాలయం తెరుచుకోకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా రైతులు ప్రభు, సత్యనారాయణ, చంద్రయ్య మాట్లాడుతూ సాగు సీజన్‌లో రైతులకు అత్యవసర సేవలు అందించాల్సిన అధికారులు సమయానికి కార్యాలయానికి రాకపోవడం వల్ల గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు సమయపాలన పాటిస్తూ కార్యాలయంలో అందుబాటులో ఉండి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు వ్యవసాయానికి అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని వారు డిమాండ్ చేశారు.

## ప్రజావాణి ఫిర్యాదులపై జాప్యం వద్దు.. బాధితులకు సత్వర న్యాయం అందించాలి: అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్



సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి / ఆగస్టు 4: ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించిన ఆయన, వ్యక్తిగత, కుటుంబ, భూ వివాదాలు, ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి ఫిర్యాదుపై చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని, పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావు ఇవ్వొద్దని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పురోగతిపై వినతిదారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని, ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ద్వారా పోలీసు శాఖపై ప్రజల విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే మెదక్ జిల్లా పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, ప్రజలు ఎలాంటి భయం లేదా సంకోచం లేకుండా పోలీసులను సంప్రదించాలని అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ హామీ ఇచ్చారు.



## ప్రజావాణి ఫిర్యాదులపై జాప్యం వద్దు.. బాధితులకు సత్వర న్యాయం అందించాలి: అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి / ఆగస్టు 4: ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించిన ఆయన, వ్యక్తిగత, కుటుంబ, భూ వివాదాలు, ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి ఫిర్యాదుపై చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని, పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావు ఇవ్వొద్దని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పురోగతిపై వినతిదారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని, ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ద్వారా పోలీసు శాఖపై ప్రజల విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే మెదక్ జిల్లా పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, ప్రజలు ఎలాంటి భయం లేదా సంకోచం లేకుండా పోలీసులను సంప్రదించాలని అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ హామీ ఇచ్చారు.



## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి / ఆగస్టు 04,ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో ప్రజావాణి అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, పాత పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు. కొత్తగా వచ్చే అర్జీలను వెంటనే నమోదు చేసి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న వినతులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై స్థానిక సమస్యలను స్థానికంగానే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భూ సమస్యలకు సంబంధించి 59, డీడబ్ల్యూఓకు 10, డీపీఓకు 7, డీఎంఅండ్‌హెచ్‌వోకు 6, ఇతర శాఖలకు చెందిన 35 దరఖాస్తులు సహా మొత్తం 117 వినతులు అందాయని, వాటిని శాఖల వారీగా పరిష్కారం కోసం పంపినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డీఆర్డీఏ పీడీ సన్యాసయ్య, సీపీఓ కిషన్, డీఈఓ అశోక్, డీపీఓ యాదగిరి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## శ్రీనిధి నిధుల గోల్‌మాల్.. సంతకాలు ఫోర్జరీ చేసిన వీఓఏపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇంచార్జి అనిల్ కుమార్ / ఆగస్టు 04,మెదక్ జిల్లా టేక్మాల్ మండలం గొల్లగూడెం గ్రామంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేసి లక్షలాది రూపాయల రుణాలు తీసుకున్నారంటూ గ్రామ వీఓఏ అంజనేయులపై బాధిత మహిళలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చదువురాని మహిళల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వారి ప్రమేయం లేకుండానే 2023లో కనకదుర్గ, మహేశ్వరి, మల్లేశ్వరి, మల్లికార్జున, నల్లపోచమ్మ, సంతోషిమాత, వీరహనుమాన్, విజయలక్ష్మి తదితర స్వయం సహాయక సంఘాల సభ్యుల పేర్లతో సుమారు రూ.18 లక్షల సీఎఫ్ (CIF) నిధులు, గ్రామ సంఘం నిధుల నుంచి మరో రూ.3 లక్షలు కలిపి మొత్తం రూ.21 లక్షల రుణాలు పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందిర, సాదు పోచమ్మ, సాదు సునంద, గంగమ్మ, కుర్ర మానెమ్మ, కుర్ర పోచమ్మ, గొల్ల సాయమ్మ, సాంగ్ గంగమ్మ తదితరుల పేర్లపై అప్పులు చూపించి మోసానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వీఓఏ అంజనేయులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు సంబంధిత బ్యాంకు ఖాతాల వివరాలు పరిశీలించి తమపై చూపిన రుణభారాన్ని తొలగించాలని బాధిత మహిళలు జిల్లా కలెక్టర్‌ను కోరారు.

## బేగంపేట బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్ / ఆగస్టు 04.సంగారెడ్డి జిల్లా కంది మండలం బేగంపేట గ్రామంలో ఆషాఢ మాసం సందర్భంగా గ్రామ సర్పంచ్ ఉమా సాయిగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం గ్రామ ప్రజలను ఆప్యాయంగా పలకరించిన ఎమ్మెల్యేతో మహిళలు, యువకులు ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివశక్తుల నృత్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ బోనాల ఊరేగింపు వైభవంగా సాగింది. బేగంపేట గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ బోనాల పండుగను బేగంపేట గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ ఛైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, చింత సాయినాథ్, మాజీ జెడ్పీటీసీ మనోహర్ గౌడ్, కృష్ణ గౌడ్, మోహన్ రెడ్డి, శంకర్ గౌడ్, రాజేందర్ నాయక్, మహిళలు, యువకులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అల్లాదుర్గం గ్రామ రోడ్ల దుస్థితిపై ప్రజావాణిలో బీజేపీ వినతిపత్రం




సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇంచార్జి అనిల్ కుమార్ / ఆగస్టు 04,మెదక్ జిల్లా అల్లాదుర్గం గ్రామంలో ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ భారతీయ జనతా పార్టీ నాయకులు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ అల్లాదుర్గం మండల అధ్యక్షుడు జిన్నా భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కాల రాములు, నీలి రమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొని గ్రామ రహదారుల దుస్థితిని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నందున అల్లాదుర్గం గ్రామ ప్రధాన రోడ్ల పునర్నిర్మాణ పనులను అత్యవసరంగా ప్రారంభించాలని వారు కోరారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని, గ్రామ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు జిన్నా భాస్కర్ రెడ్డి తెలిపారు.

## కార్మికుల హక్కుల కోసం పోరాడేది ఏఐటీయూసీ: జమ్ముల జితేందర్ రెడ్డి




సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్చార్జి శెట్టి సురేష్ / ఆగస్టు 04.కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడేది ఏఐటీయూసీ మాత్రమేనని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి అన్నారు. సోమవారం చింతకాని మండల కేంద్రంలోని గంగవరపు విజయ్ కుమార్ భవనంలో నక్కన బోయిన కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఏఐటీయూసీ చింతకాని మండల 5వ మహాసభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లతో కార్మికుల హక్కులకు నష్టం జరుగుతోందని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక విధానాలను ప్రశ్నించేందుకు కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ నెల 23, 24 తేదీల్లో సత్తుపల్లిలో నిర్వహించనున్న జిల్లా ఏఐటీయూసీ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు మాట్లాడుతూ లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తామని, కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐటీయూసీ చింతకాని మండల కన్వీనర్‌గా బండి పుల్లారావు, కోకన్వీనర్‌గా గోగుల వెంకట్రావుతో పాటు మరో ఐదుగురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ, సీపీఐ చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాల్ రావు, ఏఐవైఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి బోల్ల భాను, వర్కింగ్ ప్రెసిడెంట్ గోగుల వెంకన్న, నారపోగు సంపత్, కనకపూడి శంకర్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## అన్ని సంస్కృతులకు.. అన్ని సంప్రదాయాలకు సమాన గౌరవం: మాద్రి పృథ్వీరాజ్

సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్ / ఆగస్టు 04,జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీలో ఉత్తర భారత, ఒడిశా ప్రాంతాలకు చెందిన సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన పవిత్ర "బోల్ భమ్" ఆధ్యాత్మిక ఉత్సవంలో బీఆర్ఎస్ నాయకులు, ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులను, భక్తులను ఆప్యాయంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ అన్ని సంస్కృతులు, సంప్రదాయాలకు సమాన గౌరవం ఇవ్వడం భారతీయ సంస్కృతిలో ప్రత్యేకత అని అన్నారు. భిన్నమైన ఆచారాలు, సంప్రదాయాలు మన సమాజానికి బలమని, పరస్పర గౌరవం, సామరస్య భావనే సమాజ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. బోల్ భమ్ ఉత్సవాలు ప్రజల్లో ఆధ్యాత్మిక భావనతో పాటు సోదరభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.



## తల్లి-బిడ్డల క్షేమమే ఐసీడీఎస్ లక్ష్యం: సీడీపీఓ కమల ప్రియ

సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్చార్జి శెట్టి సురేష్ / ఆగస్టు 04,తల్లి, బిడ్డల ఆరోగ్య పరిరక్షణే ఐసీడీఎస్ ప్రధాన లక్ష్యమని చింతకాని సీడీపీఓ చావా కమల ప్రియ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా చింతకాని మండలం నేరేడ-1 అంగన్వాడీ కేంద్రంలో సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తప్పనిసరిగా అందించాలని, తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారంగా పనిచేస్తాయని తెలిపారు. తల్లిపాలు తాగిన పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరిగి శారీరక, మానసిక వికాసం మెరుగ్గా ఉంటుందని పేర్కొన్నారు. గర్భిణీలు గర్భం దాల్చినప్పటి నుంచే పోషకాహారం తీసుకోవాలని, పోషకాహార లోపం వల్ల రక్తహీనతతో పాటు ప్రసవ సమయంలో సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని వివరించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాధాన్యతపై ర్యాలీలు, గృహ సందర్శనలు, సమావేశాల ద్వారా తల్లులు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ ఎస్కే సోయర్ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందించే వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ముత్తయ్య, ఏఎన్ఎం లక్ష్మి, గ్రామ సెక్రటరీ అర్జున్, జీపీఓ వెంకట్, అంగన్వాడీ టీచర్ వెంకమ్మ, ఆశ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.



## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్చార్జి శెట్టి సురేష్ / ఆగస్టు 04,ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించే అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఖానాపురం హవేలీ శివారు టేకులపల్లికి చెందిన వి. వెంకటయ్య తనకు వృద్ధాప్య పెన్షన్ డబ్బులు జమ కాలేదని, వెంటనే ఖాతాలో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరగా పీడీ డీఆర్డీఓకు అవసరమైన చర్యల కోసం కలెక్టర్ సూచించారు. ఖమ్మం నగరం 44వ డివిజన్ లెనిన్ నగర్‌కు చెందిన ఎస్కే నాజియా తన కుమార్తె తలసేమియా వ్యాధితో బాధపడుతోందని, పెన్షన్ మంజూరు చేయాలని కోరగా పీడీ డీఆర్డీఓ, సెర్ప్ అధికారులకు చర్యల కోసం ఆదేశించారు. ఖమ్మం అర్బన్ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఎం. సూర్య ప్రకాష్ పాపిరెడ్డి తమ భూమికి దారి కల్పించాలని కోరగా జాతీయ రహదారి అధికారులకు పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. నేలకొండపల్లి మండలం నాచేపల్లి గ్రామానికి చెందిన వి. రామకృష్ణ తాను పీజీ చదివానని, కంటి దివ్యాంగత్వం ఉన్నందున ఉపాధి కల్పించాలని కోరగా జిల్లా ఉపాధి అధికారికి అవసరమైన చర్యల కోసం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డీఆర్వో సీహెచ్ రామ్మూర్తి, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలి: కాంగ్రెస్ నేతలు

సందేశం టైమ్స్ వి. సాయి / ఆగస్టు 4,నర్సాపూర్: ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్ణీత గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు), సూపర్‌వైజర్లకు సూచించారు. నర్సాపూర్ పట్టణంలోని సాయి కృష్ణ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి బీఎల్ఏలు, సూపర్‌వైజర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, కోఆర్డినేటర్ అన్వేష్ రెడ్డి పాల్గొని ఎస్ఐఆర్ ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే 99 శాతం ప్రక్రియ పూర్తి చేసిన బూత్ స్థాయి సిబ్బందిని అభినందించిన నాయకులు, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావాలని సూచించారు.

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి



సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి / ఆగస్టు 4,మెదక్: ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ఎన్యూమరేషన్ ఫారముల డిజిటలైజేషన్ ప్రక్రియను ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌తో పాటు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ (హేతుబద్ధీకరణ) ప్రక్రియలను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉన్నట్లయితే వారందరినీ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఒకే కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిజిటలైజేషన్ ప్రక్రియను ఒకటికి రెండుసార్లు పరిశీలించి ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నగేష్, ఆర్డీఓ రామకృష్ణ, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, ఎన్నికల సూపరింటెండెంట్ సింగ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిని పూర్తి స్థాయిలో ప్రారంభించాలని ఆరోగ్య శాఖ మంత్రికి వినతి

సందేశం టైమ్స్ బి. డేవిడ్ / ఆగస్టు 04,సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిని తక్షణమే పూర్తి స్థాయిలో ప్రారంభించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ ఎమ్మెల్సీ అంజిరెడ్డి రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలిసి పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్య సేవలు ప్రారంభించడంతో పాటు అవసరమైన వైద్యులు, నర్సులు,

జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రికి నూతన భవన నిర్మాణం చేపట్టి, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 104 అత్యవసర వైద్య సేవల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారి హక్కులను పరిరక్షించాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా వినతిలో పేర్కొన్న అంశాలపై మంత్రి దామోదర రాజనర్సింహ సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్సీ అంజిరెడ్డి తెలిపారు.



## మెదక్ జిల్లాను టూరిస్ట్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు పటిష్ట ప్రణాళికలు

సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి / ఆగస్టు 4,మెదక్: మెదక్ జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు పటిష్టమైన ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆర్వీ కన్సల్టెంట్ ప్రతినిధులు, పర్యాటక శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంతకుముందు ఆర్వీ కన్సల్టెంట్ ప్రతినిధులు, టూరిజం శాఖ అధికారులు మెదక్ ఖిల్లా, పోచారం అభయారణ్యాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆధ్యాత్మిక, చారిత్రక, పర్యావరణ పరంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలు ఉన్నాయని, వాటిని సమగ్రంగా అభివృద్ధి చేస్తే పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మెదక్ జిల్లాను ప్రముఖ పర్యాటక కేంద్రంగా నిలిపేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్వీ కన్సల్టెంట్ ప్రతినిధులు నందన, టూరిజం డీఈ శ్రీశైలం, ఈడీఎం సందీప్, డీపీఆర్వో రామచంద్ర రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్ / ఆగస్టు 4,పటాన్‌చెరు: గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆదేశించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సోమవారం సాయంత్రం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పటాన్‌చెరు, గుమ్మడిదల మండలాల పరిధిలోని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, పీఆర్ ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్ఆర్ నిధులను వినియోగించి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. గ్రామస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. నందిగామ గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి పది రోజుల్లో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీని ద్వారా గ్రామపంచాయతీకి ప్రతినెల ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. భానూరు, క్యాసారం, నందిగామ గ్రామపంచాయతీల పరిధిలో నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గుమ్మడిదల మండలంలోని అనంతారం, కానుకుంట, నూతనకల్, కొత్తపల్లి తదితర గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణానికి హ్యామ్ ద్వారా నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని పీఆర్ డీఈ దీపక్ తెలిపారు. టెండర్లు పూర్తయిన పనులను ప్రారంభించని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని బ్లాక్ లిస్టులో పెట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు యాదగిరి, ఉమాదేవి, పీఆర్ డీఈ దీపక్, ఎంపీవో హరిశంకర్ గౌడ్, ఏఈ శశిధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.




## అల్లాదుర్గం రోడ్ల దుస్థితిపై బీజేపీ వినతి

సందేశం టైమ్స్ అల్లాదుర్గం మండల ప్రతినిధి ప్రవీణ్ / ఆగస్టు 4,మెదక్ జిల్లా అల్లాదుర్గం: అల్లాదుర్గం గ్రామంలో దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతూ బీజేపీ నాయకులు సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించారు. వర్షాల కారణంగా గ్రామంలోని ప్రధాన రహదారులు అధ్వానంగా మారి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. రోడ్లపై ఏర్పడిన గుంతలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. రోడ్ల మరమ్మతు పనులను తక్షణమే చేపట్టి ప్రజల సమస్యను పరిష్కరించాలని బీజేపీ నాయకులు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అల్లాదుర్గం మండల అధ్యక్షుడు జిన్నా భాస్కర్ రెడ్డి, కాల రాములు, నీరిలి రమేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




## ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యానికి చేరుకోండి: ఎస్ఐ రామకృష్ణ

సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ఇంచార్జి కె. సంగమేశ్వర్ / ఆగస్టు 4,సంగారెడ్డి: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నాగల్‌గిద్ద ఎస్ఐ రామకృష్ణ సూచించారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నాగల్‌గిద్ద పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో సోమవారం 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ద్విచక్ర వాహనాలపై హెల్మెట్లు ధరించి ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగంగా వాహనాలు నడపరాదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగించరాదని, ట్రిపుల్ రైడింగ్‌కు దూరంగా ఉండాలని ఎస్ఐ రామకృష్ణ సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని, సురక్షిత ప్రయాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి రోడ్డు భద్రతకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బైక్ ప్రమాదంలో విలేఖరి మందా సత్యానందం మృతి



సందేశం టైమ్స్ ప్రతినిధి / ఆగస్టు 4,ఖమ్మం జిల్లా: బోనకల్ బ్రిడ్జి డౌన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గోవిందపురం ఎల్ గ్రామానికి చెందిన విజన్ ఆంధ్ర విలేఖరి మందా సత్యానందం మృతి చెందారు. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సత్యానందం మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, సహచరులు విషాదంలో మునిగిపోయారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తూ దర్యాప్తు చేపట్టారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలి: ఆవుల రాజిరెడ్డి



సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్ / ఆగస్టు 4,నర్సాపూర్: ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ అన్వేష్ రెడ్డి సూచించారు. నర్సాపూర్ పట్టణంలోని శ్రీ సాయి కృష్ణా గార్డెన్స్‌లో నియోజకవర్గ స్థాయి ఎస్ఐఆర్–బీఎల్ఏ సూపర్వైజర్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్ఏలు, సూపర్వైజర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. నియోజకవర్గంలో ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తిచేయడంలో కృషి చేసిన ప్రతి బీఎల్ఏ, సూపర్వైజర్‌ను అభినందించారు. షిఫ్ట్ అయిన ఓటర్లు, మరణించిన ఓటర్లు, డూప్లికేట్ ఓటర్ల వివరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటరు జాబితా పూర్తిగా పారదర్శకంగా, కచ్చితత్వంతో ఉండేలా ప్రతి బూత్‌లో బీఎల్ఏలు, సూపర్వైజర్లు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, పార్టీ నాయకులు, మండల, పట్టణ అధ్యక్షులు, బీఎల్ఏలు, సూపర్వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.